
ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


వివిధ ఆకారాల్లో..


విద్యుత్ ప్రమిదలు

దివ్వెల దీపావళి

వెలుగుల పండుగకు వేళాయే..

- టపాసుల మోతతో మోగనున్న వీధులు
- కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి
- ఆకర్షణీయ డిజైన్లతో ప్రమిదలు

సండే స్పెషల్

సత్తుపల్లిటౌన్: ఈ నెల 20న దీపావళి పండుగను జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. లక్ష్మీ దేవిని పూజించి, బాణసంచా కాల్చేందుకు సిద్ధం కావడంతో పాటు ఆలయాలను, దుకాణాలు, ఇళ్లను ముస్తాబు చేసే పనిలో ప్రజలు నిమగ్నమయ్యారు. పూలు, విద్యుత్‌దీపాల దండలతో అలంకరిస్తున్నారు. రంగవల్లులు వేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో ప్రతి ఇంటా దీపావళి సందడి వాతావరణం నెలకొంది.

దుకాణాల ఏర్పాటు..

దీపావళికి ముందు రోజు నుంచి నెల రోజుల పాటు ప్రమిదలను కార్తీకమాసమంతా అందంగా అలంకరిస్తుంటారు. ఇంటింటా దీపాల వెలుగులు విరజిమ్మేందుకు సత్తుపల్లి, మధిర, వైరా, కల్లూరు మున్సిపాలిటీలతో పాటు పట్టణాలు, గ్రామాల్లోని మార్కెట్లలోకి ప్రమిదలు వచ్చేశాయి. కొందరు సైకిళ్లు, బుట్టల్లో పెట్టుకుని వీధుల్లో తిరుగుతూ పలువురు ప్రమిదలను విక్రయిస్తున్నారు.

వివిధ ఆకృతులతో...

మట్టి, పింగాణీ ప్రమిదలు వివిధ ఆకృతులలో ఆకర్షణీయంగా ఉన్నాయి. తాబేలు, కొబ్బరికాయ, నెమలి, గణపతి, గోల్డ్, వెండి రంగుల్లో లక్ష్మీదేవి కుందులు, సాదా కుందులు, ఆకాశదీపం కుందులు నక్షత్రం, నాగుపాము డిజైన్లలో ప్రమిదలు, 360 వత్తులు వెలిగించే కుందులు ఆకట్టుకుంటున్నాయి. గుజరాత్, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి డిజైన్, ఫ్యాన్సీ ప్రమిదలు తెచ్చి విక్రయిస్తున్నారు. దీంతో మహిళలు, యువతులు కొనుగోళ్లు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రమిదల సైజ్, డిజైన్‌ను బట్టి వీటిధరలు రూ.10నుంచి రూ.600వరకు విక్రయిస్తున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో నీటితో వెలిగించే ప్రమిదలు, విద్యుత్ ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి.


పింగాణీ ప్రమిదలు


లక్ష్మీదేవి రూపంలో..

అనేక డిజైన్లలో..

దీపావళి, కార్తీక మాసంకోసం ఇతర రాష్ట్రాల నుంచి ఆకర్షణీయమైన డిజైన్ ప్రమిదలు, చాలారకాల మోడల్ బొమ్మలను తెచ్చి విక్రయిస్తుంటా. దాదాపు 30రకాల డిజైన్ ప్రమిదలు అందుబాటులో ఉన్నాయి. ఇళ్లముందు ప్రమిదలను వెలిగించేందుకు మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు.

– బి.ఉమామహేశ్వరి, సత్తుపల్లి

కానరాని పండుగ సందడి

ఈసారి తగ్గిన బాణసంచా షాపులు

మధిర: దీపావళి పండుగ సమీపించింది. ఈ పండుగకు ఇంటింటా ప్రమిదలను వెలిగించడం ఆనవాయితీ. దీంతో మధిర మెయిన్ రోడ్డు వెంట పలువురు చిరువ్యాపారులు ప్రమిదలను అమ్మకానికి పెట్టారు. అయితే, ఇప్పటివరకు పెద్దగా కొనుగోళ్లు లేక వ్యాపారులు ఖాళీగా ఉంటున్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడం, వానాకాలంలో సాగుచేసిన పంటలు చేతికి అందకపోవడంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు కొందరు సంప్రదాయ ప్రమిదలు కాకుండా నీళ్లు పోస్తే వెలిగే ఫ్యాన్సీ ప్రమిదలు, బ్యాటరీలు, విద్యుత్‌తో వెలిగే ప్రమిదలు కొనుగోలు చేస్తున్నారు.

బాణసంచా అంతంతే..

దీపావళికి వారం ముందు నుంచే బాణాసంచా పేలుళ్లు వినిపించేవి. ఇటీవల సోషల్ మీడియాలో పర్యావరణ పరిరక్షణపై ప్రచారం జరుగుతుండడం, యువత సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తుండడానికి తోడు బాణసంచా ధరలు పెరగడంతో కొనుగోలుకు చాలామంది ఆసక్తి చూపడం లేదు. గతంలో మధిరలో దీపావళికి సుమారు 20కి పైగా షాపులు ఉండేవి. కానీ ఈ సారి ఎనిమిది షాప్‌లకే లైసెన్సు తీసుకోవడం గమనార్హం.


వెలవెలబోతున్న బాణసంచా దుకాణాలు

బంద్ విజయవంతం

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, జనసేన, న్యూడెమోక్రసీ, బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీలు నిర్వహించి నిరసనలు తెలిపారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలను మూసి వేయించారు. పలుచోట్ల బీజేపీ నాయకులకు, కాంగ్రెస్, సీపీఎం నాయకులకు మధ్య వాగ్వాదం జరగ్గా.. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరుపక్షాలను సముదాయించారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్షం నాయకులు


మధిర డిపో వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు


వైరాలో..


ఏన్కూరు: రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు


కొణిజర్లలో..


కల్లూరు: రాస్తారోకో నిర్వహిస్తున్న బీసీ సంఘాలు, అఖిపక్షం నాయకులు


సత్తుపల్లిరూరల్: బీజేపీ, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం


తల్లాడలో..


ముదిగొండలో..


కల్లూరురూరల్: మోటారుసైకిల్ ర్యాలీలో బీజేపీ నాయకులు


ఎర్రుపాలెంలో..


చింతకాని: నాగులవంచలో ర్యాలీ చేస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు


బోనకల్‌లో..


పెనుబల్లి: బంద్‌లో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు


కారేపల్లి: ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

క్లుప్తంగా

రాష్ట్రంలో పేదల ప్రభుత్వం


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగుతోందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండలంలోని కలకొడిమలో లబ్ధిదారురాలి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై ఇంటిని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. అనంతరం కుర్నవల్లిలో ఇటీవల మృతి చెందిన గుర్రాల సామ్రాజ్యం చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుదాకర్, దిరిశాల నరసింహారావు, కిషోర్, అయిలూరి వెంకటకోటారెడ్డి పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ప్రత్యేక అభిషేకాలు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలోని శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు దాములూరి సతీష్‌శర్మ తెలిపారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఈనెల 22నుంచి నవంబర్ 20వరకు ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. గోత్ర నామార్చనకు రూ.616, అభిషేకాలకు రూ.2,116, రుద్రాభిషేకానికి రూ.5,116 చెల్లించాలని తెలిపారు. వివరాలకు 89194 29238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విశ్వప్రగామి ట్రస్ట్ కేంద్రాలు ప్రారంభం


కేంద్రాలను ప్రారంభిస్తున్న మిషక్, రాజచంద్ర

పెనుబల్లి: మండలంలోని 'విశ్వప్రగామి ట్రస్ట్' ఆధ్వర్యంలో ఆరు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆసంస్థ ప్రతినిధి రాజచంద్ర, యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొత్తపల్లి మిషక్ తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఆసక్తిగల విద్యార్థులకు ట్రస్ట్ సహకారంతో పలకలు, బోర్డులు, లైట్లు, పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎ.ప్రభాకర్, ఏఎల్ టీచర్ శిరోమణి, దివ్య, జయమ్మ, విజయమ్మ, వరలక్ష్మి, ఇజ్రాయిల్, పలు గ్రామాల ప్రజలు, స్థానికులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై వెంకన్న

బోనకల్: రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడినవారము అవుతామని ఎస్సై పొదిలి వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో రెండో ఆశ్రయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏళ్లుగా తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు సంస్థద్వారా సేకరించిన రక్తాన్ని అందించి ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్, ఇరుగు లెనిన్, భద్రూనాయక్, పారుపల్లి ప్రేమ్‌కుమార్, ములకారపు రవి, స్వచ్ఛందసంస్థ నిర్వాహకులు ఇరుగు నవీన్, రమేష్, జయసూర్య, కటకం రత్నాకర్, మురళి, తేజ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో తాగునీటి సమస్యల దృష్ట్యా గ్రామవాసి, సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య మంచినీటి బోరు వేయించారు. ఈ సందర్భంగా శనివారం ఎస్సై వెంకన్న శంకుస్థాపన చేసి దాత బరకయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్వరరావు, వెంకటమోహన్, పాపారావు, లింగయ్య, రాములు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం, పంచారామాలకు డీలక్స్ బస్సులు

సత్తుపల్లిటౌన్: కార్తీకమాసం సందర్భంగా సత్తుపల్లి డిపో నుంచి అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఊటుకూరి సునీత తెలిపారు. శనివారం కార్యాలయంలో ఎంవీఐ జెఎస్ శ్రీనివాస్‌తో కలిసి పుణ్యక్షేత్రాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్తీకమాసంలో ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు సత్తుపల్లి నుంచి అన్నవరం, పంచారామాలకు డీలక్స్ బస్సు బయలుదేరి కార్తీక సోమవారం పుణ్యక్షేత్రాలకు చేరుకుంటుందన్నారు. అన్నవరం వెళ్లే పెద్దలకు రూ.570, పిల్లలకు రూ.330 ఛార్జీలు(ఒకవైపు మాత్రమే) నిర్ణయించినట్లు తెలిపారు. పంచారామాలకు పెద్దలకు ఛార్జీ రూ.1500, పిల్లలకు రూ.770గా నిర్ణయించామన్నారు. 30మంది భక్తులు ఉంటే ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రాములు, సూపర్‌వైజర్లు బాలస్వామి, ఆనంద్ పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎం సునీత, ఎంవీఐ శ్రీనివాస్

రాయితీపై వ్యవసాయ పరికరాలు

సత్తుపల్లిరూరల్/తల్లాడ: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లను అందించడం జరుగుతుందని ఏఓలు వై.శ్రీనివాసరావు, ఎండి.తాజుద్దీన్ తెలిపారు. చేతిపంపులు, బ్యాటరీ మ్యానువల్ పంపులు, పవర్ స్ప్రేయర్స్, తైవాన్ పంపులు, పవలర్ టిల్లర్, బ్రష్ కట్టర్, పవర్ వీడర్, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను రాయితీపై పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, 5ఎకరాలు పైన ఉన్న పెద్ద రైతులకు 40శాతం సబ్సిడీతో పనిముట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, రెండు ఫొటోలతో ఈనెల 24వ వరకు ఆయా ఏఓలకు అందజేయాన్నారు. మరిన్ని వివరాలకు మీ దగ్గరలోని వ్యవసాయ విస్తరణ అధికారులను లేక మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు.

సీపీఐ ఉత్సవాలను జయప్రదం చేయండి

కారేపల్లి: ఖమ్మంలో డిసెంబర్ 26న నిర్వహించే సీపీఐ శత వసంతాల బహిరంగ సభను ప్రతీ కార్యకర్త జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. శనివారం కారేపల్లి క్రాస్‌రోడ్డులో.. పుచ్చకాయల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కారేపల్లి, కామేపల్లి మండలాల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఏర్పడి నూరు సంవత్సరాలు పూర్తిచేసుకుని చరిత్ర సృష్టించిందన్నారు. పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని, పేదలు ఉన్నంతకాలం కమ్యూనిజం బతికే ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, రావి శివరామకృష్ణ, పాపిని సత్యనారాయణ, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ఉంగరాల సుధాకర్, తాతా వెంకటేశ్వర్లు, బాణోతు దళ్‌సింగ్, చెన్నంశెట్టి భూషయ్య, నామ అప్పారావు, పాటి అనంత రామయ్య, పురం వెంకట్, వెంకటరెడ్డి, బండి శ్రీనుబాబు, సలీం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సురేష్

మహిళలకు ముగ్గులు పోటీలు

చింతకాని: మహిళలు కుటుంబ పోషణలోనే కాక అన్ని రంగాల్లో ముందు నిలవాలని పలువురు సూచించారు. మండలంలోని మత్కేపల్లిలో దీపావళి సందర్భంగా శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మహ్మద్ రఫీ – ఉమారాణి దంపతులు బహుమతులు అందజేయగా వక్తలు మాట్లాడారు.

ఇకపై ఆన్‌లైన్‌తో అనుసంధానం


ఉపాధిహామీ కూలీల వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలకు సంబంధించిన వివరాలను ఇకపై ఆన్‌లైన్‌తో అనుసంధానం చేయడం జరుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని తెలిపారు. మండలంలో 13వేల మంది ఉపాధి కూలీలకు గానూ.. 10వేల మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, ఈనెలాఖరు నాటికి మిగిలిన వివరాలు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు. కూలీల వివరాలు, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, వ్యక్తి కనుబొమ్మలు కూడా నిక్షిప్తం చేస్తున్నారు.

వ్యవసాయ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు

తల్లాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు. శనివారం తల్లాడలో మన్నేపల్లి రామారావు అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్త శుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పులి కృష్ణయ్య, నాయకులు చల్లా నాగేశ్వరరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం


పంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: సామాజిక న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనతోనే సాధ్యమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శనివారం కారేపల్లి మండలంలో రూ.20లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న అప్పాయిగూడెం జీపీ భవన నిర్మాణాన్ని శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణానికి 3గుంటల స్థలం అందించిన దాత రమేష్ చంద్రగుప్తను సన్మానించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని, విడతల వారిగా ఇందిరమ్మ ఇండ్ల బిల్లులను లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, దీన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రమేష్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, డీఈ కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మంజుల, మండల అధ్యక్షులు చంద్రప్రకాశ్, రామ్మూర్తి, దేవ్లానాయక్, కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మధిర: మండల స్థాయి పాఠశాలల ఆటల పోటీల్లో శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు వరుసగా రెండోసారి ఛాంపియన్లుగా నిలిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.అంజన్ బాబు తెలిపారు. మడుపల్లిలో గత మూడు రోజులుగా నిర్వహించిన మండలస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

బీసీ గురుకుల విద్యార్థులు..

కొణిజర్ల: ఈ నెల 17, 18 తేదీల్లో మండలంలోని సెయింట్ అలోషియస్ పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి పాఠశాలల క్రీడల్లో అమ్మపాలెం పంచాయతీ పరిధిలోని మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకులం విద్యార్థులు విజేతలుగా నిలిచి ట్రోఫీ గెలుచుకున్నారు. దీంతో వారిని పాఠశాలలో ప్రిన్సిపల్ బి.నాగమణి, ఏటీపీ రంజిత్, డిప్యూటీ వార్డెన్ నిర్మల, హెచ్ఎస్ తులసి, పీఈటీ టి.భాస్కర్ అభినందించారు.


కొణిజర్ల: బాలురను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు


అవగాహన కల్పిస్తున్న మధిర ఏడీఏ విజయ్ చంద్ర

చింతకాని: ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయటం జరుగుతుందని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ చంద్ర పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నర్సింహాపురంలో పత్తి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్ నుంచి పత్తి అమ్మకాలను మొత్తం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ అను మొబైల్ యాప్ ద్వారా రైతు మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. పత్తి పంట వేసిన రైతులందరూ సంబంధిత ఏఈఓల వద్దకు వెళ్లి పంట నమోదు వెబ్‌సైట్‌లో రైతుల మొబైల్ నంబర్ సరిగా ఉందో, లేదో చూసుకోవాలని, లేకపోతే కేంద్రాల్లో పత్తి అమ్మడం సాధ్యంకాదన్నారు. కార్యక్రమంలో ఏఓ సోములపల్లి మానస, వ్యవసాయ విస్తరణాధికారులు తేజ, కల్యాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎన్ ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎస్ జయరాజు - 96528 68642